క్లుప్తంగా

'అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేయాలి'

మహాముత్తారం : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, జెడ్పీటీసీ శారద, ఎంపీపీ సుభద్ర అన్నారు. బుధవారం మండలంలోని మీనాజీపేటలో సాక్షితో వారు మాట్లాడారు. మండలంలో కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీకి తెలియకుండా ఇష్టం వచ్చినట్లు ప్రెస్‌నోట్లు ఇస్తున్నారని వారు అన్నారు. ఇలాంటి ప్రకటనలపై కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు సీరియస్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి పార్టీకి తెలియకుండా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు ఇష్టం వచ్చినట్లు పత్రిక ప్రకటనలు చేస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

గ్రామకమిటీ ఎన్నిక

మహదేవపూర్ : మండలంలోని రాపెల్లికోటలో బుధవారం యాదవ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా కాట్రేవుల లచ్చయ్య యాదవ్, అధ్యక్షుడిగా పంచిక మల్లేష్, ఉపాధ్యక్షుడిగా కల్ల గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా జాగారి చిన్న రాజయ్య, కార్యదర్శిగా అనుముల రవి, కోశాధికారిగా కాట్రేవుల దేవేందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

మహదేవపూర్ : మండల కేంద్రానికి చెందిన పిడుగు కొమురయ్యకు చెందిన రెండు గొర్రెలు దొంగతనం చేసిన బియ్యం ఒదేలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ బుధవారం తెలిపారు. కొమురయ్యకు చెందిన మంద నుంచి తప్పిపోయిన రెండు గొర్రెలను మార్కెట్లో అమ్మినట్లు తెలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే విచారణ చేపట్టిన పోలీసులు బియ్యం ఒదేలు వాటిని విక్రయించినట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాధనాశూరుల విన్యాసాలు



శాయంపేట : శాయంపేట గ్రామంలోని రైతు బజారులో బుధవారం సాధనాశూరుల విన్యాసాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన చింతకింది శంకర్, సమ్మయ్య, శోభన్‌బాబు, మధు, వెంకన్న, గంజి సతీష్, అశోక్, వెంకన్న మంత్రాలు లేవని మూఢనమ్మకాలను నమ్మొద్దని కళాత్మక ప్రయోగాల ద్వారా ప్రజలకు వివరించారు. మనిషి తలపై కట్టెల పొయ్యి పెట్టి అప్పడాలు కాల్చడం, నీటిలో వేసిన పసుపును ముద్దలుగా తీయడం, తాళ్లతో బంధించడం తదితర విన్యాసాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి, పద్మశాలి కుల పెద్దలు బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, వలుపదాసు వెంకటరమణ, మామిడి చంద్రమౌళి కుల సభ్యుల నుంచి సేకరించిన ఆర్థికసాయాన్ని సాధనాశూరులకు అందజేశారు. ప్రతి ఐదు ఏళ్లకు ఒకసారి గ్రామాల్లో ప్రదర్శన చేస్తుంటామని తమ తరంతోనే ఈ కళ అంతరించిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రాములోరి అక్షింతల పంపిణీ



రేగొండ: ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు



మొగుళ్లపల్లి : అక్షింతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

రేగొండ: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి పూజిత అక్షింతలు బుధవారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ ఉమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మాడగాని శంకర్, సుదర్శన్, శంకర్, తిరుపతి, మల్లేష్, వెంకన్న, సంతోష్, రాజేందర్, సుధాకర్, భిక్షపతి, మల్లయ్య, సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలకు శోభాయాత్ర

మొగుళ్లపల్లి : రామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం మండలంలోని పిడిసిల్ల గ్రామంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర మండల సంచాలన్ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలుగొద్దు



జాతర పనులు పరిశీలిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి : ఫిబ్రవరి 21, 22, 23, 24వ తేదీల్లో మొగుళ్లపల్లి-ముల్కలపల్లి గ్రామాల మధ్య జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఆవరణలో చేపట్టాల్సిన పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు. జాతరకు చుట్టు పక్కల మండలాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరవుతారని వారికి సరిపడా తాగునీరు, స్నాన ఘట్టాలు, సేదతీరడానికి గుడారాలు, మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ, డీఈ అమ్రపాలి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ కృష్ణవేణి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఏఈ భాస్కర్, ముల్కలపల్లి సర్పంచ్ చదువు అన్నారెడ్డి, మొగుళ్లపల్లి సర్పంచ్ మోటె ధర్మారావు, విద్యుత్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



మంగపేట: నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న ఎస్సై రవికుమార్

మంగపేట : తల్లిదండ్రులను కోల్పోయి రెక్కల కష్టంతో జీవితం గడుపుతున్న అక్కాచెల్లెలకు జ్వాలా యూత్ సభ్యులు, ఎస్సై గోదరి రవికుమార్ అండగా నిలిచారు. మేమున్నామంటూ వెంటనే నగదు, నిత్యావసర సరుకులను బుధవారం వారికి అందజేసి చేయూత నిచ్చారు. మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన దండ్యాల రాణి, రమ్య అనే ఇద్దరు అక్కచెల్లెలు.. కొన్నేళ్ల క్రితం వీరి తల్లిదండ్రులు మృతి చెందడంతో రోజు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. కనీసం ఉండేందుకు తమకు సొంత ఇల్లు కూడా లేకపోవడంతో వారి దీన పరిస్థితిని స్థానికులు జ్వాలా యూత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన స్థానిక ఎస్సై రవికుమార్ సాయంతో రూ.5,000 నగదుతో పాటు జ్వాలా ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10,000 వేల విలువైన, మంచం, దుప్పట్లు, వంట సామగ్రి, నిత్యావసరాలను అందజేసి చేయూత నిచ్చారు. ఈకార్యక్రమంలో జ్వాలా యూత్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అజయ్, రవికుమార్, రాజు, రాంమోహన్, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

శాయంపేట : శాయంపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ నాయకుడు కోమటి వీరస్వామి సేవలు చిరస్మరణీయమని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి అన్నారు. వీరస్వామి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి, వీరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉండే వారి సేవలు మరువలేనివని అన్నారు. టీచరుగా ఎంతో మంది విద్యార్థులను బావి భారత పౌరులుగా తయారు చేసిన ఘనత వారికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇసాక్ అలీ, కుసుమ వెంకటేశ్వర్లు, బాసాని కోటేశ్వర్, సంతోష్, పల్లేరు వీరస్వామి, బూర భిక్షపతి, కొండ హనుమాన్‌ప్రసాద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల' దరఖాస్తు గడువు పొడిగింపు

చిట్యాల : మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20 వరకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా సమన్వయ అధికారి గోల్కొండ భిక్షపతి ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఐదో తరగతికి రూ.100లు, పదో తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇంటర్‌లో ప్రవేశానికి ఫిబ్రవరి 4న, ఐదో తరగతి ప్రవేశానికి ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష ఉంటుందని భిక్షపతి తెలిపారు. గురుకులాల్లో నాణ్యతతో కూడిన విద్య, పోషక విలువలు కలిగిన భోజనం, బ్రేక్ ఫాస్ట్, స్నాక్స్, ఉచిత పుస్తకాలు, నోట్ బుక్స్‌లు మూడు జతల యూనిఫామ్ అందిస్తారని చెప్పారు. ఒకసారి ఐదో తరగతిలో అడ్మిషన్ పొందితే ఇంటర్ వరకు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యను అందిస్తామని సాంఘిక సంక్షేమ జిల్లా గురుకుల సమన్వయ కర్త భిక్షపతి పేర్కొన్నారు.

నేడు వాహనాల వేలం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు(గురువారం) ఉదయం జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఆ శాఖ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. తుప్పు పట్టిన వాహనాలతో పాటు, రోడ్ వర్కింగ్ వాహనాలకు సైతం వేలం వేస్తామన్నారు. ఆసక్తిగలవారు రూ.50శాతం ఈ.ఎం.డీ రూపంలో కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వాహనాలు కొనుగోలు చేసిన వ్యక్తులు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాలనీవాసులు

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్ట్ ప్రభావిత శాంతినగర్‌కాలనీలో నెలకొన్న సమస్యలను సింగరేణి అధికారులు పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2 ఏర్పడిన నాటి నుంచి శాంతినగర్ కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బాంబ్ బ్లాస్టింగ్‌తో ఇంటి గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, పలువురి ఇళ్లు, గోడలు కూలినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బండ రాళ్లు సైతం ఇళ్లపై పడినట్లు పేర్కొన్నారు. ఓపెన్ కాస్టు నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల అనేక రోగాలు వస్తున్నాయని తెలిపారు. సింగరేణి అధికారుల బృందం కాలనీలో పర్యటించి తమ సమస్యను పరిష్కరించేందుకు ఎటువంటి స్పందన లేదన్నారు. సింగరేణి ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించిన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తిక్క ప్రవీణ్, సాంబయ్య, కిష్టయ్య, శ్రీనివాస్, నారాయణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించండి

టేకుమట్ల : రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీలతో వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు చెల్లించాలని ఏఎస్సై అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి, వాటిపై ఉన్న పెండింగ్ చలాన్లు తనిఖీ చేశారు. పలువురు వాహనదారుల నుంచి పెండింగ్ చలాన్లు వసూలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనాలపై ఉన్న రాయితీ చలాన్లు చెల్లించేందుకు గడువు సమీపిస్తున్న తరుణంలో ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా వాటిని చెల్లించాలన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాల బారిన పడి శారీరకంగా, ఆర్థికంగా నష్టపోతారని, ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ మహేందర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

క్రీడా సామగ్రి, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని మహితాపురం, మరికాల, దానవాయిపేట, చొక్కాల, వీరభద్రవరం, ఎదిర గ్రామాల్లోని పేద విద్యార్థులకు జీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీటీసీ పాయం రమణ, బర్లగూడెం సర్పంచ్ నర్సింహామూర్తి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాల్లోని పేద విద్యార్థులకు జీఎస్ఎస్ సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రేమ్‌రాజ్, ఏటూరునాగారం కోఆర్డినేటర్ ఎలిషాబాబు, సర్పంచ్‌లు సత్యవతి, సమ్మక్క, గంగ తదితరులు ఉన్నారు.

వీడీసీలు ఆదివాసీలకే ఇవ్వాలి



మాట్లాడుతున్న భోజారావు

ఎస్ఎస్‌తాడ్వాయి : జాతరలో అభివృద్ధి పనుల వీడీసీలను స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలని మేడారం గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన భోజారావు డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన అభ్యుదయ సంఘం భవనం వద్ద వారు మాట్లాడుతూ.. మేడారం జాతరలో జరిగే అభివృద్ధి పనులను స్థానిక గిరిజనులకు ఇవ్వడం లేదన్నారు. గిరిజనేతరులు అధికారులతో కుమ్మక్కు కావడంతో వారికే వీడీసీ పనులను అప్పగిస్తున్నారని, దీంతో స్థానిక గిరిజనులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.25లక్షల వీడీసీ పనులను ఆదివాసీలకే ఇవ్వాలని, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ పదవిని స్థానికులకే కేటాయించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గడిగ అనిల్, ప్రధాన కార్యదర్శులు ఆలం వెంకటేష్, కొక్కర పూర్ణచందర్, సిద్దబోయిన రమేష్, ఆలం సమ్మరావు, శంకర్, అర్జున్, అట్టం రమేష్, నరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మహాముత్తారం: పరామర్శిస్తున్న శ్రీనుబాబు



టేకుమట్ల: బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు



మంగపేట: నివాళులర్పిస్తున్న సూర్య తదితరులు

మహాముత్తారం : మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన బోయిని మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా అతన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు బుధవారం పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని ఆస్పత్రి ఖర్చులకు సాయం చేస్తానని కుటుంబ సభ్యులను ఆయన సూచించారు. అదేవిధంగా మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ అజయ్ తండ్రి సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. శ్రీనుబాబు వెంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బియ్యం అందజేత

టేకుమట్ల : మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన సంగి ఆనందరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులను అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పరామర్శించి, 50కిలోల బియ్యం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంగి సదానందం, నైనన్, లెనిన్, రవివర్మ, రాజశేఖర్, మహేందర్, కళ్యాణ్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.



మల్హర్: పరామర్శిస్తున్న సంఘం నాయకులు

ఆర్థికసాయం

మల్హర్ : మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కొడపర్తి రమేష్‌యాదవ్ ఇటీవల మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బుధవారం అఖిల భారత యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు మేకల సంపత్‌యాదవ్ పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నలిగేటి సతీష్, బోయిని రాజయ్య, యాదండ్ల రామయ్య, పోచంపల్లి కత్తరశాల, మొగిలి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి రూరల్ : అనారోగ్యంతో ఇటీవల సింగరేణి ఏరియా ఆస్పత్రిలో మచ్చ రమేష్ మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు ఆదర్శ పద్మశాలి సహకార సంఘం సుభాష్ కాలనీ ఆధ్వర్యంలో బుధవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గోరంటల విక్రమ్ సేన, ఉపాధ్యక్షుడు చీకటి తిరుపతి, కార్యవర్గ సభ్యుడు పాశి కంటి శ్రీనివాస్, బడుగు శివ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మంగపేట : మండలంలోని రాజుపేటకు చెందిన కోడం గౌరయ్య ఇటీవల మృతి చెందాడు.కాగా, గౌరయ్య దశదిన కార్యక్రమానికి యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మంత్రి సీతక్క తనయుడు ధనసరి సూర్య బుధవారం హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం గౌరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, నాయకులు పల్లికొండ యాదగిరి, వల్లెపల్లి శివప్రసాద్, గాదె శ్రావన్‌కుమార్, శ్రీరాం రామ్మోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు

- కనిపించని రేడియం సూచిక బోర్డులు
- పట్టించుకోని శాఖ అధికారులు



మంగపేట-మల్లూరు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ఏటూరునాగారం : చుట్టూ పచ్చని చెట్లతో నిండిన అటవీ ప్రాంతం.. అందులో నుంచి వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసిన జాతీయ రహదారి.. కానీ, కొన్ని చోట్ల ఈరోడ్డుపై ప్రమాదకర మూల మలుపులు ఉన్నాయి.. ప్రయాణికులు గమనించక అలాగే ముందుకు సాగితే అంతే సంగతి.. మలుపు వద్ద ప్రమాదకరం అని తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ఏటూరునాగారం నుంచి భద్రాచలం వైపు ఉన్న రోడ్డు పొడువునా ఉన్న మలుపు వద్ద సూచిక బోర్డులు కరువయ్యాయి. అలాగే ఏటూరునాగారం-వరంగల్ హైవే, ఏటూరునాగారం నుంచి కొండాయి మీదుగా మేడారం వెళ్లే రోడ్లపై సైతం అనేక మలుపులున్నాయి. కానీ వీటిపై ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు దృష్టి పెట్టడం లేదు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులకు రోడ్డు ఎక్కడ వరకు ఉందో.. ఎటువైపు వెళ్తుందో అర్థంగానీ పరిస్థితి. దీంతో వాహనాలు అదుపు తప్పి బోల్తా పడడం, ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ఢీకొనడం జరుగుతుంది. మలుపుల వద్ద గతంలో రేడియంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయగా.. రాత్రి వేళలో సైతం వాహనాల వెలుతురుకు దారి ఎటువైపు ఉందనేది స్పష్టంగా అర్థం అయ్యేది. కానీ ఇప్పుడు అవి చూద్దామన్న ఎక్కడ కూడా లేకపోవడంతో వాహనదారులు, బాటసారులు తికమక పడుతున్నారు.

సమీపిస్తున్న మేడారం జాతర..

ఫిబ్రవరి 21వ తేదీ నుంచి జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వాహనాల్లో వచ్చే భక్తుల సౌకర్యం కోసం అధికారులు హెచ్చరికలు, సూచిక బోర్డులను అమర్చేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజుల వ్యవధి ఉన్నప్పటికీ అధికారులు రోడ్లపై పెద్దగా దృష్టి పెట్టడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతరకు వెళ్లే మార్గంలో వాహనదారులు సమాచారం తెలుసుకునేందుకు ముఖ్య ఆధారం సూచిక బోర్డులే.. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేడియంతో చేసిన సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



చిన్నబోయినపల్లి నుంచి మేడారం జాతరకు వెళ్లే మార్గంలో ప్రైవేట్ వాహనదారులకు కనిపించేలా రేడియంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు లేక మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

- కుక్కల శంకర్, షాపెల్లి

అసంపూర్తిగా రోడ్లు..



ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి ఏటూరునాగారం మీదుగా షాపెల్లి వైపు వచ్చే ప్రైవేటు వాహనదారులకు అసంపూర్తిగా ఉన్న కల్వర్టులు, రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కొండాయి, షాపెల్లి, కొండ్రేడు తదితర ప్రాంతాల్లో రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. వాటి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలి

- సల్మాన్, కొండాయి, ఏటూరునాగారం

క్రీడల్లో గెలుపోటములు సహజం



ఎస్సైని శాలువాతో సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

రేగొండ(కొత్తపల్లిగోరి) : మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ.. క్రీడలలో గెలుపోటములు సహజమన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో జగ్గయ్యపేట, కొత్తపల్లిగోరి నిలిచాయి. వాలీబాల్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో భాగిర్తిపేట, మైలారం నిలిచాయి. విజేతలకు ఎస్సై రవికుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్, యువజన నాయకులు విష్ణు, సుమన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.